
# జిడ్డు



"నాన్నా! రాజుగారు పిలుస్తున్నారు. లైన్లో ఉన్నారు. మీతో మాట్లాడా లంటున్నారు."

గబగబా మిద్దె దిగి వచ్చిన మా అమ్మాయి గసపోసుకొంటూ చెప్పింది.

రాజుగారి పిలుపు-అంటే రాజాజ్ఞ వంటిదే! అంటే-తలగొట్టి మొలేస్తాడని కాదు. మా ఇద్దరి మధ్య అనుబంధం అలాంటిది.. అయితే అప్పటి నా పరిస్థితి? జన్మాని కొక శివరాత్రి అన్నట్లుగా ఆ రోజు...ఆ వేళప్పుడు...తలంటు పోసుకోవాలన్న కోరిక కలిగింది. ఒళ్ళంతా నూనె జిడ్డ జిడ్డుగా ఉంది. లంగోటాకు మించిన అచ్ఛాదనలేదు. అలానే మిద్దె పైకి వెళ్ళడమా? మళ్ళీ మాట్లాడ్తానని చెప్పడమా? అని ఒక్క క్షణం తటపటాయించాను. అంతలోనే-'ఇంత సేపు అక్కడే గదా ఉన్నాను! ఇంతలో ఏమయ్యిందో, ఏమో? లేకుంటే ఎందుకు ఫోన్ చేస్తారు?' అన్న సందేహం కలిగేసరికి ఎదురుగా పడి ఉన్న చిన్న చవకాన్ని అందుకొన్నాను. మొలకు చుట్టుకొంటూ మిద్దెపైకి వెళ్ళాను. ఫోన్ అందుకొన్నాను. ఎలుగిచ్చాను.

"రేపే బొంబాయి వెళ్ళిపోతున్నాడట సుందర్! మీతో మాట్లాడా లంటున్నాడు."

రాజుగారి మాట చెవిని పడేసరికి నిలువెల్లా ఆశ్చర్యం కలిగింది. ఆ ఆశ్చర్యంలో అవతలవైపు నా మాట కోసరం ఎదురుచూస్తుంటారన్న స్పృహ కూడా లేకుండా పోయింది. అయితే రాజుగారి పుస్తకాల అంగడి మాత్రం కనులముందు మెదిలింది. అక్కడికి ఎంతోమంది వస్తుంటారు. వచ్చే వాళ్లందరికీ అంతో ఇంతో సాహిత్యాభిమానం ఉండనే ఉంటుంది. అందరినీ కాకపోయినా రాజుగారు కొంతకు కొంతమందిని పరిచయం చేస్తూనే ఉంటారు. పరిచయమైన వాళ్ళందరూ జ్ఞాపకం ఉండవచ్చు. ఉండకపోవచ్చు. కానీ సుందర్ మాత్రం!

ఏ మాత్రం పట్టించుకోని తల... 'నాఇష్టం నాది' అన్నట్లుగా పెరిగినగడ్డం.... ఎంతో బరువు బాధ్యతల్ని మోయలేక కుంగిపోయి నట్లున్న ఆకారం... ఆ ఆకారం ఒకటుందికాబట్టి... ఆ ఆకారం నాలుగు ఆకారాల్తో కలిసి తిరగవలసిన అవసరం ఉంది కాబట్టి.... ఆ ఆకారానికీ తమకూ ఎలాంటి సంబంధం లేకపోయినా... సంబంధం కల్పించుకొంటున్నా మన్నట్లుగా ప్యాంటూ, షర్టూ! పలికితే నోటిముత్యాలు రాలిపోతాయేమో? అన్నంత భయం. వయస్సా? మూడు పదులకు మించదు. ఆ వయస్సులోనే ఎంతో నిరాశా నిస్పృహలకు నిలయమైనట్టున్న వాలకం. 'ఇతనికి సుందర్!' అని ఎవరు పేరు పెట్టారో కానీ చాలా తప్పు చేశారే?' అన్న భావన కలిగేది అతన్ని చూస్తుంటే! కానీ ఆ కన్నుల్లో మాత్రం భావన కందని ఏదో కాంతి!

ఆ సుందర్ నాతో మాట్లాడా లంటున్నాడా? నా ఆశ్చర్యానికి అదే కారణం.

అంతలోనే– "ఫోన్ ఇవ్వమంటారా?" రాజుగారు అడుగుతున్నారు.

"ఇవ్వండి" అన్నాను.

రాజు గారు ఫోన్ సుందర్ చేతికి ఇచ్చినట్లుంది. "నమస్కారమండీ! నేను సుందర్ని!" అవతలి వైపునుండి సుందర్ గొంతు వినిపించింది.

"చెప్పండి"

"రేపు నేను బొంబాయి వెళ్ళి పోతున్నాను."

"రాజుగారు చెప్పారు కదా?

అంటే– మళ్ళీ అదే మాట చెప్పడం ఎందుకూ? అని దెప్పి పొడిచినట్లుంది నా మాట. సుందర్ పసిగట్టలేదు.

"ఈ వేళ మిమ్మల్ని ఇంటికి తీసుకొస్తానని మా అమ్మకు మాటిచ్చాను."

"నువ్వు మాటిస్తే నాకేం? ఇవ్వకపోతే నాకేం? నువ్వు రేపు బొంబాయికి వెళ్ళిపోతే నాకేం? వెళ్ళకపోతే నాకేం?" అని ధ్వనించేటట్లుగా 'ఇప్పుడా?' అన్నాను. అది కూడా ఆ తల కెక్కలేదు.

"అవునండీ! రేపు నేను ప్రయాణం హడావిడిలో ఉంటాను. మధ్యాహ్నం రాయలసీమలో బయల్దేరి హైదరాబాద్ వెళ్ళతాను. అక్కడ కొంత పని ఉంది. చూసుకొంటాను. అటునుంచి అటే బొంబాయి వెళ్ళిపోతాను. అందువల్ల రేపు సాయంత్రానికి వాయిదా వెయ్యడం కుదరని పని."

'ఏమిటీ మనిషి? చట్టాన్ని చేతిలోకి తీసుకొన్న న్యాయాధిపతి మాదిరి వాయిదా ఇవ్వడానికి వలను పడదంటున్నాడే?' అని ఆలోచిస్తున్నాను.

"రేపు ఉదయాన మీ కార్యకలాపా లేమిటో తెలియదు. అందువల్ల ఇప్పుడైతే అన్ని విధాలా సౌకర్యంగా ఉంటుంది. ఆచార్య రాంప్రసాద్ గారు కూడా మీ కోసరం కాచుకొని ఉంటారు."

'మధ్య ఊడిపడ్డ ఈ ఆచార్య పురుషుడెవరు? ఇదెక్కడి జిడ్డురా తండ్రీ!' అని నాలో నేను మల్లగుల్లాలు పడ్తున్నాను.

"మీరు ఇంటి దగ్గరే ఉండండి. నేనూ రాజుగారు వస్తున్నాం. నా కొక చిన్న వాహనముంది. మిమ్మల్ని తీసుకొని వెళ్ళి మళ్ళీ తెచ్చి ఇంటి దగ్గరే దింపుతాను."

"చూడండి! సుందర్‌గారూ!...."

"నేను పిల్లవాణ్ణి. ఒక్కసారిగా అంత పెద్దవాణ్ణి చెయ్యకండి."

"సరే సుందర్! లేకలేక ఈ వేళ ఎందుకో తలస్నానం చెయ్యాలన్న కోరిక కలిగింది. ఇప్పటి నా ఆకారాన్ని చూస్తే నువ్వు భయపడి పారిపోతావు. ఎందుకు కానీ...స్నానం పానం అయ్యేటప్పుడికి చాలా ఆలస్యమవుతుంది. ఇంకొకసారి మీరు బొంబాయి నుంచి వస్తారు కదా? కలుస్తాం గదా? అప్పుడు చూద్దాంలే !"

"మళ్ళీ నేను బొంబాయి నుంచి రావడం ఎప్పుడో ఏమో? ఫరవాలేదు. మీరు సావకాశంగా స్నానం చెయ్యండి. అంతవరకు నేనుంటాను. మన కోసరం వాళ్ళు తప్పనిసరిగా ఎదురు చూస్తుంటారు."

"చూడు సుందర్! ఇప్పుడు గంట తొమ్మిది కావస్తూ ఉంది. నేను బయటపడేప్పటికి కనీసం ఇంకొక గంటయినా పడ్తుంది. నా ఒక్కడి కోసరం ఇంతమందిని...ఇంత రాత్రప్పుడు..."

"ఎంత ఆలస్యమైనా సరే! మీరు వస్తే అంతమందీ సంతోషిస్తారు. లేకపోతే బాధపడ్తారు."

"సరే" అనక తప్పలేదు.

సాధ్యమైనంత తొందరగానే స్నానంచేసి బయల్దేరుతూంటే–

"ఫోన్‌లో ఆ జిడ్డు వదిలించుకోవడానికే అర్థగంటకు పైగా పట్టింది. ఇంక ఎదురెదురుగా కూర్చుంటే తెల్లారిపోతుందేమో? ఊళ్ళో లేనప్పుడు సరేసరి. ఉన్నప్పుడు కూడా వేళ కంత తిందామని ఆశలేదు." అని మా శ్రీమతి గొణుగుతూ ఉంది.

"నా కోసరం మీరు ఎదురు చూస్తూ కూర్చోవలసిన అవసరం లేదు. నా కంటే ముందుగా మీరు తింటే నేరుగా నరకానికి పోవడమో ఆ తరువాత తింటే స్వర్గద్వారాలు తెరుచుకొని ఉండడమో జరగని పని. మీ సౌకర్యం మీది. మీ ఆకలి మీది. ఆకలైతే తినండి. హాయిగా పడుకోండి. ఈ సూటిపోటి మాటలెందుకు?"

బంగాళాఖాతంలో తుఫాన్ ఆవేశం గుండెల్లో సుడిగుండాలు సృష్టించినా ఈ మగగొంతును దాటలేకపోయింది!

ఈ దేశంలో నేను మగవాణ్ణి! పైగా ఒక వ్యక్తికి మొగుణ్ణి. ఆవేశాన్ని అణచుకొని గడపదాటను.

వీధిని పడేటప్పటికి ఇంట్లో పోరు నా నుంచి విడాకులు పుచ్చుకొనింది. మనస్సు కాస్త తేలికపడింది. వీధి అప్పుడప్పుడే మాటుమణుగుతూ ఉంది. కొందరు ఒక్క తలుపు మాత్రం తెరిచి పెట్టుకొని నాటి ఆర్జిత సేవల్లో– అంటే లెక్కా పక్కా చూసుకోవడంలో నిమగ్నులై ఉన్నారు. చుక్కేసిన మొనగాళ్లు మాత్రం వీధుల్లో ముగ్గేస్తున్నారు.

ఇంటినీ ఇంటిపోరునూ విదిలించుకొని వీధి పరిస్థితి నుంచి దృష్టిని మరల్చుకొనేసరికి నా దృష్టి సుందర్ వైపు మళ్ళింది.

సరిగ్గా పదిరోజుల కిందటే రాజుగారు సుందర్‌ని తనఅంగట్లో పరిచయం చేశారు. ఆ పరిచయం కూడా– 'ఆహా! అంటే ఓహో!' అన్న తీరులో కాకుండా చాలా సామాన్యంగా జరిగింది. సుందర్ నవ్వుతూ నమస్కరించాడు. నేను నా అబ్బగంటేదో పోతుందన్నట్లుగా మూతి బిగించుకొని తలమాత్రం ఆడించాను– గంగిరెద్దుమాదిర. ఆతరువాత అతనేదో కొన్ని పుస్తకాలు కొనుక్కొని వెళ్ళిపోయాడు. అప్పుడు నేను రాజుగారి వైపు చూస్తూ నవ్వాను 'ఎవరీ అవతారం?" అన్నట్లుగా!

"సుందర్ వృత్తిరీత్యా ఇంజనీర్! ప్రవృత్తి రీత్యా జిడ్డు కృష్ణమూర్తిగారి ఆరాధకుడు!" అన్నాడు రాజుగారు.

ఆ మాటతో నాలోని రచయిత మేల్కొన్నాడు. "జిడ్డు కృష్ణమూర్తిగారి ఆరాధకుడు అంటే–జిడ్డు కృష్ణమూర్తి ఒక వ్యక్తి. ఇది కేవలం ఒక వ్యక్తి ఆరాధన. ఈ దేశం ఇలా వ్యక్తి ఆరాధనల్లో తగలబడిపోవాల్సిందేనా? జిడ్డు కృష్ణమూర్తిగారి ఆరాధకులు కొందరు... పుట్టపర్తి సాయిబాబా ఆరాధకులు కొందరు... జిల్లెళ్ళమూడి అమ్మ ఆరాధకులు కొందరు... నోరూ వాయీ లేని రాళ్ళూ రప్పల్ని ఆరాధిస్తూ ఎందరో? వీళ్ళందర్నీ సవాల్ చేస్తూ అతీంద్రియశక్తుల్ని అవహేళన చేస్తూ అబ్రహం కోవూరిగారి ఆరాధకులు కొందరు– ఎవరిపిచ్చి వాళ్ళకానందం అన్నట్లుగా! అంతే కానీ దేశాన్నీ దేశం ఎదుర్కొంటున్న సమస్యల్నీ దేశమంటే మనుషులనే భావాన్ని ఆరాధించవలసిన ఈ యువతరం వ్యక్తిఆరాధనల్లో పడి ఎందుకూ తరావడి కాకుండా పోతున్నదే? సుందర్‌కి అంటుకొన్న ఈ జిడ్డును సాధ్యమైనంత మందికి అంటిస్తే కానీ– అతని కంటికి నిద్రపట్టదు. ఈ ఆరాధకులనబడే ప్రతి ఒక్కడూ ఇంతే! నిర్వీర్యమై పోతున్న ఈ జాతిగతి... భవిష్యత్తు ఏమైపోతుందో ఏమో?"

అప్పటికి ఈ జాతిగతికి... భవిత్యత్తుకు మూలస్తంభాలు రచయితలే! – అన్నట్లుగా వకాల్తా పుచ్చుకొని ఆలోచిస్తున్నా!.

చిత్రాతి చిత్రమైందేమంటే? – పిడికెడంత మెదడు ఎన్నెన్నో విషయాల్ని ఎన్నెన్నో విధాలుగా అవసరమైతే నిక్షిప్తం చేసుకొంటుంది. అవసరమైనప్పుడు అవిష్కరిస్తుంది. ఈ శక్తి దాని కెవరు సమకూర్చారో? ఎలా సమకూర్చారో? ఇది ఎన్నేళ్ళ శ్రమ ఫలితమో?

ఎప్పుడో పది రోజుల కిందట రాజుగారి అంగట్లో ఒకటి రెండు నిముషాల అనుభవాన్ని ఎంత చక్కగా అవిష్కరిస్తూ ఉంది నా మెదడు! అది గొప్పతనంగానే నేను గొప్పలు పోతున్నాను. సుందర్ వ్యక్తిగత ఆరాధన పట్ల అసంతృప్తిని అనుభవిస్తూనే ఉన్నాను. అయినా కండ్లు కనపడ్తూనే ఉన్నాయి. కాళ్లు కదుల్తూనే ఉన్నాయి.

నేను రాజుగారి అంగడిని చేరే సరికి సరిగ్గా పది గంటలయింది! రాజుగారికి అంగడి తెరవడంలో ఒక పద్ధతి పాటింపులేవు గానీ– మూసుకొని పోవడంలో మాత్రం పద్ధతీ, పట్టింపూ ఉన్నాయి. ఏ పరిస్థితుల్లోనూ తొమ్మిది గంటలకు ఠంచన్‌గా అంగడి మూత పడాల్సిందే! అయినా పాపం... రాజుగారు ముండ్లమీద కూర్చున్నట్లుగా ఆవేళ నాకోసరం ఎదురు చూస్తున్నారు.

నన్ను చూస్తూనే సుందర్ పైకి లేచాడు. వినయంగా రెండు చేతులు జోడించాడు.

'మీతో ఫోన్‌లో మాట్లాడినప్పుడు ఒక్క విషయం చెప్పడానికి మరిచాను" అని చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"ఏమిటా కొసురు?" అన్నట్లుగా కొరకొర చూశాను.

"ఈ రాత్రి మీరు మాతో కలిసి భోంచేస్తున్నారు!"

"భోంచేసి బయటపడ్తే ఇంతే సంగతులన్న భయంతో మా శ్రీమతి తిండి కూడా పెట్టకుండా తరిమింది. ఆ పని కూడా అక్కడ పూర్తి చేసి వస్తే రాత్రికి తిరుపతి రోడ్ల కథంతా క్షుణ్ణంగా అవగాహన చేసుకోవచ్చు– ఈ రోడ్ల మిందే తెల్లారుతుంది. కాబట్టి!"

"మీరు భార్యా విధేయులా?"

"నీకు భార్య వచ్చిన తరువాత గుర్తు పెట్టుకొని అడుగు. ఆ మాటకు సమాధానం చెప్తాను. కానీ ఇంతవరకూ మనం ఎంతవరకు వెళ్ళాలో... తమ ఇల్లెక్కడో చెప్పారు కాదు."

రాజుగారు ముసిముసిగా నవ్వుతున్నారు.

సుందర్ ఏమాత్రం ప్రతిస్పందించకుండానే అడిగిన దానికి బదులు చెప్పే విద్యార్థి మాదిర వినయంగా నిలబడి "విద్యానగర్ కాలనీ" అన్నాడు.

అనుకోనట్లుగా అనుకోనంత సంపద నెత్తిన పడ్తే మంచి చెడ్డల్ని పూర్తిగా మరిచిపోయే మనిషిలా వగా తగా రెండూ లేకుండా పెరిగిపోయిన తిరుపతిలో విద్యానగర్ కాలనీ మూడు నాలుగు కిలోమీటర్ల దూరాని కవతల తగలబడింది. అంత రాత్రిపూట. అంత దూరం వెళ్ళి అతిథి సత్కారాలు. నా మనస్సులోని అభిప్రాయం వద్దనుకొన్నా మొగంలో వన్నెలు మీరుతూ ఉంది. ఏ మాత్రం లౌక్యుడైనా అప్పటి నా పరిస్థితి అవలీలగా అంచనా వేస్తాడు. అయితే దీని కంతటికీ అతీతుడుగా "బయల్దేర్దామా?" అంటూ సుందర్ తన బుల్లి వాహనాన్నెక్కి నన్నూ ఎక్కమన్నాడు. ఎక్కి కూర్చున్నాను.

రాజుగారు కూడా వస్తారనుకుంటే– మమ్మల్ని సాగనంపడంవరకే తనభాధ్యతగా చేతులూపుతూ నిలబడుకొన్నాడు.

వాహనం కదిలింది. గణపతిని వీపుమీద ఎక్కించుకొన్న ఎలుక మాదిర. అయితే ఎలుక నడక నడవలేదు. ఉడతలా ఎగిరెగిరి పడ్తూ ఉంది– రోడ్ల పుణ్యామా అని!

నేతాజీ రోడ్డు దాటి, బేరి వీధి మలుపులు రెండూ తిరిగి, పాతమున్సిపల్ ఆఫీసును వెనక్కి నెట్టేసి, బాలాజీ కాలనీలోని భవంతులు ఆవేళప్పుడు వెదచల్లుతున్న వింత వింత పరిమళాల ప్రభావాల్ని పక్కకు నెట్టి, కులపతి లేకుండా పతిని పోగొట్టుకొన్న కులసతిలా తనలో తాను కుమిలిపోతున్న కులపతి బంగళా దాటి రెడ్ బిల్డింగ్స్‌ని దాటి రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను దాటి –సింగంలా దూసుకుపోతున్న సుందర్ వాహనం ఉన్నట్టుండి బాట పక్కగా వెళ్ళి టపీమని ఆగిపోయింది. ఎలుక వాహనాని కేదో ఇబ్బంది వచ్చి అలుపు తీర్చుకోవాలని ఆగిందో? లేకపోతే ఇంతసేపు తన లోకం తనదిగా ఉండిన ఈ పుణ్యాత్యుడు లోకం కంట పడకుండా రోడ్డు పక్కకు పోవాలనుకున్నాడో? అని అనుకొంటూనే దిగాను.

"ఒక్క నిముషం సార్!" అంటూ సుందర్ వాహనాన్ని నిలబెట్టి పరుగెత్తుకొంటూ వెళ్ళాడు. 'ఈ చీకట్లో ఎక్కడికి వెళ్తున్నా డబ్బా?" అని ఆలోచిస్తూ కండ్లు చించుకొని అతన్నే చూస్తున్నాను.

రెండుమూడు బార్లకవతల నాలుగైదు పెద్దరాళ్ళు. రోడ్డుమీద అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. ఒక్కొక్క రాతిని ఇద్దరు మనుషులు మోసితెచ్చి ఉంటారనిపిస్తూ ఉంది. చూస్తూనే ఉన్నాను. సుందర్ ఒక్కొక్క రాతిని అవలీలగా ఎత్తి రోడ్డుకు దూరంగా పారేశాడు. ఆ తరువాత పరుగెత్తుకొంటూ వచ్చి వాహన మెక్కి 'ఎక్కండి సార్!' అన్నాడు. ఎక్కి కూర్చున్నాను. వాహనం కదిలింది.

ఆ చీకట్లో నా కంటపడని రాళ్ళమీద నా మనసు పడింది. ఎలుక వాహనం ఉడతలా ఎగిరెగిరి పడ్తూ ముందుకు దూసుకుని పోతూ ఉంది.

"ఒక రోజు సార్. మా డిపార్ట్‌మెంటులో నా పని పూర్తయ్యేసరికి చాలా పొద్దుపోయింది. రాత్రి పన్నెండు గంటలై ఉంటుందేమో? అప్పుడు ఒంటరిగా నడిచి వస్తున్నాను. సరిగ్గా ఇక్కడే అనుకొంటాను. రోడ్డుమీద ఇలానే వదిలిపెట్టిపోయిన రాతికి కొట్టుకొనిందేమో? స్కూటర్ అంత దూరంలో పడి ఉంది. మనిషి రక్తంలో స్పృహ లేకుండా పడి ఉన్నాడు. మంచినీళ్ళు తెస్తామని దేవస్థానం డెయిరీ ఫారంలోకి పరిగెత్తాను. నా పరుగుల్ని చూసి అక్కడొక కుక్క నన్ను వెంటాడింది. పరిగెత్తి దానికి లోకువ కావడం ఎందుకని నిలబడ్తే పైనబడి కరిచింది. అయినా ఎవర్నో బతిమాలి నిద్దర్లేపి, నీళ్ళు దెచ్చి దారిని పోతున్న వాళ్ళ సహాయంతో అతన్ని రుయా హాస్పిటల్ చేర్చేసరికి– ఓహ్!"

వెనుక కూర్చొని ఉన్నా అతడు విడిచిన వేడి నిట్టూర్పు నన్ను తాకింది.

"ఏదో అవసరం కొద్దీ రాళ్ళు తెచ్చుకొంటారు. ఆ అవసరం తీరిపోతే వాటి సంగతే మరిచిపోతారు. కాస్త ఓపిక పట్టి ఈ రాళ్ళను రోడ్డు పక్కలకు నెట్టేస్తే ఈ ప్రమాదా లుండవు. అవసరం తీరిపోతే మనిషి ఆలోచన కూడా కోల్పోయేటట్టుగా ఉంది సార్!"

నా మనస్సు ఆ రాళ్ళ చుట్టే తిరుగుతూ ఉంది.

ఒక వేళ సుందర్ బండికి వెనక బరువు ఎక్కువవుతుందన్న భావనతో నా చేతికి తన వాహనాన్నిచ్చి నన్నే నడపమని ఉండినా ఆ రాళ్ళు నా కంటపడి ఉండవు. అడ్డమనిపిస్తే అవలీలగా తప్పించుకొని పొయ్యేవాడినే కానీ... అంత రాత్రిపూట బండిని నిలిపి వాటితో మద్దిస్తం పెట్టుకొనే చాదస్తం ఉండదు. ఇది వాస్తవం!

నా భుజాల్ని నేనే తడుముకొంటున్నాను. నా తడుముడు నాదిగా ఉంటే-సుందర్ వాహనం ఏమాత్రం తడబడకుండా తన ఇంటి ముందర ఆగింది.

అంతవరకూ ఎదురుచూస్తున్న సుందర్ తల్లి, చెల్లెండ్లు మమ్మల్ని చూస్తూనే గబగబా వాకిట్లోకి వచ్చారు. నవ్వుల పువ్వులు చల్లుతూ స్వాగతం పలికారు. వాళ్ళ ప్రతికదలికలో సంస్కారం ప్రతిఫలిస్తూ ఉంది. హాల్లో కూర్చున్నాము. అందమైన అమ్మాయికి ఆభరణాల్తో అవసరం లేనట్లుగా ఆ ఇల్లు నిరాడంబరంగా ఉన్నా నిండుగా ఉంది.

సుందర్ తల్లి నేను మా అమ్మగారి మీద రాసిన వ్యాసాన్ని తలపోసి తలపోసి మురిసిపోతూ ఉంది. ఏదో ఒకకథ చాలా బాగా నచ్చిందని సుందర్ చెల్లెండ్లు అదేపనిగా వంతులేసుకొని తెగ మెచ్చుకొంటున్నారు.

అంతలోనే ఆచార్య రాంప్రసాద్ గారు మాతో కలిశారు.

ఆ వాతావరణంలో ఆయన- వాతావరణ కాలుష్యం... తన్నివారణోపాయాలు... చెట్ల పెంపకాలు... తత్ప్రయోజనాలు... బైపాస్ రోడ్ల ఆవశ్యకతలు... బ్రాంది తప్పతాగిన మనిషి మాదిర తయారైన గాంధీరోడ్డు గొడవలు... ఈ యాత్రాస్థలాన్ని ఒక సుందరతర పట్టణంగా తీర్చిదిద్దడంలో తిరుపతి దేవస్థానం బాధ్యతలు- ఇంకా ఇలాంటివే ఏమేమో ఆచార్య పురుషుడి హోదాకు తగిన మాటల్నే ప్రవాహ వేగంతో కుమ్మరిస్తున్నాడు. పైగా నా వంటి రచయితలు కథలు, బుర్రకథలు, గేయాలు రాసి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలని హెచ్చరిస్తున్నాడు.

నేను ఇంకా మనిషిని కాలేదు. నినాదాలకూ మానవతా విలువలకూ మధ్య ఒక సరిహద్దు రేఖను గీస్తే సుందర్ ఎక్కడ నిలబడతాడు? అని ఆలోచిస్తున్నాను.

"సార్! మీరు కాసేపు మాట్లాడుకోండి. మీ మాటలు పూర్తయిన తరువాత కలిసి భోంచేయండి. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. నా కోసరం డిపార్ట్‌మెంటులో ఒక విద్యార్థి కాచుకొని ఉంటాడు. రేపే వెళ్ళి పోతున్నాను. కాబట్టి అతనికి కొంత గైడెన్సు ఇవ్వాలి. రాంప్రసాద్ గారు మిమ్మల్ని ఇంటి దగ్గర వదిలిపెడ్తారు!" అంటూ ఎవరి మాటకోసరం ఎదురు చూడకుండా గబగబా వెళ్ళిపోయాడు.

'అంత అన్నమైనా తినకుండా వెళ్ళిపోతున్నాడే?' అని కన్నపేగు పడ్తున్న బాధ కన్నుల్లో ప్రతిఫలిస్తూ ఉంది. ఆమెవైపు చూడలేకుండా తలవంచుకొంటే మనస్సు సుందర్ వెంట పడింది.

"అస్తవ్యస్తమైన ఈ వ్యవస్థ జిడ్డు వదిలించడానికి కలం పట్టిన ఓ రచయితా? బాట పక్కన కూర్చున్న ముసల్ది... ఆ ముసలిదాని వొంటిమీద ముడతలు... ఆ ముడతల మీద లేచిన పుండు... ఆ పుండు పై వాలుతున్న ఈగలు... విద్వేషాల విస్తళ్ళు... ప్రతీకార జ్వాలలు... సూర్యచంద్రుల తాకట్లు... నీ కంట పడ్డాయ్. కానీ మనిషి పురోగమనానికి పురులు విప్పవలసిన మనస్తత్వాలు తిరోగమనంలో తైతక్కలాట నీకంట పడలేదే?" అని రోడ్డుకు అడ్డదిడ్డంగా పడినరాళ్ళు... నడుములు విరిచే అరటి తొక్కలు నవ్వుతూ నా గుండెల్ని బాదుతున్నట్లుంది.

"ఆచార్య రాంప్రసాద్ గారూ! వేదికల్ని కంపుగొట్టించి... కాగితాన్ని ఖరాబు చేసే మనలాంటి వాళ్ళు గాదు ఈ సమాజానికి కావల్సింది. సుందర్ లాంటి కర్మయోగులు!'' అని చెప్పాలనుకొన్నాను. కానీ చెప్పలేక పోయాను!

ఎంతైనా రచయితను కదా? ఆ జిడ్డు వదలడమంటే మాటాలా? ●

ఆంధ్రప్రభ
(21 అక్టోబర్ 1987)